ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విఒఎల పోరుబాట



సమస్యలపై అనకాపల్లిలో ఆందోళనకు దిగిన విఒఎలు (ఫైల్‌ఫొటో)

- కనీస వేతనం ఇవ్వాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్
- నేటి నుంచి 36 గంటల నిరసన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇచ్చిన హామీలను అమలుచేయక పోవడంతో విఒఎలు పోరుబాట పట్టారు. 36 గంటల నిరవధిక నిరసనకు సమాయత్తమయ్యారు. ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) నేతృత్వంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి బుధవారం వరకు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద వీరి ఆందోళన కొనసాగనుంది. వైఎస్ఆర్ క్రాంతి పథకంలో పనిచేస్తున్న వెలుగు విఒఎలు మూడు సంవత్సరాలకు మించి పనిచేయ రాదన్న సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేతన బకాయి చెల్లించాలని, మహిళా మార్టు, కోళ్ళు, మొక్కలు అమ్మకం లక్ష్యాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వీరు ఆందోళన చేపట్టనున్నారు.

జిల్లాలో 24 మండలాల్లో 1279 మంది విఒఎలు పనిచేస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీరి గౌరవ వేతనం పది వేల రూపాయలు పెంచుతానన్న ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట అమలుచేయకపోగా కొత్త సమస్యలు తెచ్చి పెట్టారు. ఎనిమిది వేల మిగతా 2లో..

కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

పది వేల రూపాయల గౌరవ వేతనంలో ఎనిమిది వేల రూపాయలు ప్రభుత్వం నుంచి, రెండువేలు గ్రామ సంఘం నుంచి తీసుకోవాలని ప్రభుత్వం చెప్పింది. గ్రామ సంఘాల్లో ఆదాయం లేక రెండు వేల రూపాయల వేతనం నోచుకోలేకపోతున్నాం. మహిళా మార్టుల్లో సరుకుల కొనుగోలు టార్గెట్ రద్దు చేయాలి. కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేసి, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలి. రూ.10 లక్షలు గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.

సిహెచ్.రూపాదేవి, రాష్ట్ర అధ్యక్షులు,
ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు)



ఇన్ఫోసిస్ కార్యాలయంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సిఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నెల 16న విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రుషికొండ ఐటి సెజ్ ప్రాంతాలను జివిఎంసి అధికారులు, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి మిగతా 2లో..

మద్యం అమ్మకాలతో..

జగన్ జేబులోకి నెలకు రూ.5 వేల కోట్లు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు అనిత విమర్శ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని మద్యం అమ్మకాలలో నెలకు రూ.5 వేల కోట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జేబుకు వెళ్తున్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. సోమవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యపాన మిగతా 2లో..

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ

▶ వార్త 4లో..

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి, వైసిపి నాటకాలు

▶ వార్త 2లో..

మీడియాపై దాడులు అమానుషం

▶ వార్త 5లో..

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విశాఖ జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్యాడీ ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి తప్పనిసరిగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఆర్‌బికెలకు అనుసంధానం చేసి ప్రక్రియ సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. క్లస్టర్ ఆర్‌బికెలలో టెక్నికల్ అసిస్టెంట్లు జిల్లాలో గన్నీ బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి, మిల్లర్ల నుంచి సేకరించి నిల్వ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా సంబంధిత వాహనాలకు జిపిఎస్‌కు అనుసంధానం చేయాలని డిటిసికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, మిగతా 2లో..

సత్యనారాయణ సేవలు ఎనలేనివి

సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - వేపగుంట : సిపిఎం గోపాలపట్నం జోన్ నాయకులు పి.సత్యనారాయణ సేవలు ఎనలేనివని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. సత్యనారాయణ సంస్మరణ సభ జివిఎంసి 93వ వార్డు పరిధి అప్పన్నపాలెంలోని ఆయన స్వగృహం వద్ద సోమవారం జరిగింది. సిఐటియు నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ సత్యనారాయణ మరణం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ప్రతి మనిషికీ మరణం సహజమని, జీవిత కాలంలో చేసిన సేవలు మాత్రం తరతరాలూ గుర్తుండి పోతాయని అన్నారు. సత్య నారాయణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మిందితో పాటు గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన పోరాటాల్లో సత్యనారాయణ, ఆయన సతీమణి చురుగ్గా పాల్గొన్నారన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ తదితరులు

సత్యనారాయణ ఎక్కడ ఉంటే అక్కడ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకునే వారని తెలిపారు. ఏదైనా ఒక పని అప్పజెప్పినప్పుడు దానిని ఎంతో బాధ్యతగా సత్యనారాయణ నెరవేర్చే వారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విఓఎల పోరుబాట

రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని, రెండు వేల రూపాయలను గ్రామ సంఘం నుంచి తీసుకోవాలని ఇచ్చిన హామీ సరిగా అమలుకు నోచుకోలేదు. 18 ఏళ్ల నుంచి జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ (డిఆర్‌డిఎ)లో వైఎస్‌ఆర్ క్రాంతి పథకం కింద డ్వాక్రా సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్న విఓఎల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం మూడు సంవత్సరాలకు మించి పని చేయరాదని సర్క్యులర్ 64ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో విఓఎలు అభద్రతలో సేవలందిస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరు హెచ్‌ఆర్ పాలసీ విడుదలచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతుంటే అందుకు భిన్నంగా ప్రభుత్వం మరిన్ని సమస్యలను సృష్టిస్తోంది.

కనీస వేతనం కరువాయె..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఓఎలదే కీలకపాత్ర. గ్రామాల్లో ఎన్నో సేవలందిస్తూ ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు తెచ్చిపెడుతున్నప్పటికీ కనీస వేతనాలు అమలుచేయకపోవడంపై విఓఎలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించకపోవడంతో సంవత్సరాల తరబడి వేతనాలు అందని విఓఎల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం అప్పజెప్పిన పనులు చేస్తున్న విఓఎలకు విత్తనాలు, కోళ్లు, మొక్కలు, మహిళా మార్ట్‌లో సరుకుల అమ్మకాలను అప్పగించడంతో వీరు తీవ్రమైన ఒత్తిళ్లకు లోనవుతున్నారు. అమ్మకపు లక్ష్యాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లైస్ ఐ.రాజేశ్వరి, జిల్లా రవాణా అథారిటీ అధికారి ఎం.బుచ్చిరాజు, జిల్లా సహకార అధికారిణి ప్రవీణ, డిప్యూటీ కమిషనర్ లీగల్ మెట్రాలజీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టెక్నికల్ ఎం.సృజన పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ఎనలేనివి

చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం నాయకులు టివి.కృష్ణంరాజు, శ్రీలక్ష్మీ నరసింహ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ముద్దాడ వరప్రసాదరావు, సిపిఎం నాయకులు బి.పద్మ, వి.ప్రభావతి, శ్రీమన్నారాయణ, అనంతలక్ష్మి, శేషారత్నం, లీలా, లావణ్య పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు

పరిశీలించారు. ఇన్ఫోసిస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభించే ప్రాంగణం, స్టేజీతో పాటు హెలిప్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి ఇన్ఫోసిస్ ప్రతినిధులకు తగు సూచనలు చేశారు. కంపెనీ పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం, విద్యుత్తు, రోడ్ల పరిశుభ్రత, రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు, గ్రీనరీ తదితర పనులను త్వరతగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు, ఎఎమ్ఒహెచ్ డాక్టర్ ఎన్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతి రాజు, డిఇ వంశీ పాల్గొన్నారు.

జగన్ జేబులోకి నెలకు రూ.5 వేల కోట్లు

నిషేధం అమలు చేస్తేగానీ మళ్లీ ఓటు అడగనని సిఎం జగన్ జనాన్ని మోసపుచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఒక్క మద్యం మీదనే రూ.98 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తోందన్నారు. ఇది ఒక చిన్న రాష్ట్రం బడ్జెట్‌తో సమానమని పేర్కొన్నారు. నాణ్యత లేని మద్యం సేవించడం వల్ల ఉదర, కిడ్నీ సమస్యలతో పెక్కు మంది ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. ఒక్క కెజిహెచ్‌లోనే గడిచిన మూడు నెలల్లో 1075 మంది మద్యం వల్ల అనారోగ్యంతో చేరారన్నారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. ఉద్యోగులకు మాత్రం పదో తేదీ వచ్చినా జీతాలు వేయడం లేదని ఎద్దేవా చేశారు. పథకాలు పేరు చెప్పి బటన్ నొక్కుతూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఏ కొద్ది మందికో పథకాలు అమలు చేసి లక్షల మందికి ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రోజా మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

'ఆడుదాం - ఆంధ్ర' కిట్లు పరిశీలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెలలో నిర్వహించబోతున్న ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమం నేపథ్యంలో జిల్లాకు అందిన ఆడుదాం - ఆంధ్ర క్రీడలకు చెందిన స్పోర్ట్స్ కిట్ల శాంపిల్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం పరిశీలించారు. కిట్లు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. సెట్విస్ సిఇఒ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సచివాలయాలకూ ఈ కిట్లును పంపిస్తామన్నారు. ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నంలో జరుగుతాయన్నారు.



కిట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

డిపిఆర్ఒగా నారాయణరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలో డివిజనల్ పిఆర్ఒగా డి.నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంత వరకూ విజయనగరంలో ఎపిఆర్ఒగా పనిచేసి ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్ అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి, వైసిపి నాటకాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వైసిపి, బిజెపిలు కపట నాటకాలు ఆడుతున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. .స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 919వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా ఉద్యమం జరుగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు అనుకూలంగా మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతూ జగన్ పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. అందుకు ఉదాహరణగా గంగవరం పోర్టులో ఉన్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ వాటాను పూర్తిగా ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడాన్ని ఉదహరించారు.

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిజెపి, వైసిపిలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కల్లబొల్లి ప్రకటనలు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, నాయకులు కోట సత్తిబాబు, కాసారపు సత్యనారాయణ, లింగాల వెంకటేశు, వైఎస్.మూర్తి, కె.ఈశ్వరరావు, గుణ శంకర్, కిలారి శివ, బంగారు దుర్గారావు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

సొసైటీ భూమి అప్పగించరూ..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తమకు చెందిన 9.68 ఎకరాల భూమిని ఎపిఐఐసి సర్వే చేసి స్వాధీన పరచుకోవడంపై మైనారిటీస్ డవలప్‌మెంట్ సొసైటీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు షేక్ నూర్ అహ్మద్ కలెక్టర్ ఎ.మల్లికార్జునను సోమవారం కలిశారు. తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. 190 పేద కుటుంబాలకు చెందిన సర్వే నెంబరు 7/4ఎ2లోని 86 ఎకరాల భూమిని పెందుర్తి మండలం నరవ విఎస్ఇజెడ్‌కు ఆనుకుని గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిందని తెలిపారు. 2006లో ఎపిఐఐసి అధికారులు ఒక ఇంగ్లీష దినపత్రికలో అడ్వర్టయిజ్‌మెంట్ తెలుగులో వేసి తమకు తెలియకుండా వారికి అనుకూలంగా 9.68 ఎకరాలపై అవార్డు పొందారని ఆవేదన చెందారు. ఆ భూమిని తమ ముస్లిం మైనారిటీ పేద కుటుంబాలన్నీ 1984-1986 మధ్య కాలంలో న్యాయబద్ధంగా కొనుగోలు చేసుకున్నాయని, 2006లో ఎపిఐఐసి అర్ధాంతర జోక్యం చేసుకుని అవార్డు పొందడంతో తమ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయని వాపోయారు. తమ భూమి మొత్తాన్ని తమకు అప్పగించాలని కోరారు. భూమి విషయమై కోర్టుకు వెళ్తే తమకే అనుకూలంగా రిపోర్టు వచ్చిందన్నారు. మరలా 2011లో ఎపిఐఐసి కోర్టుకెళ్లి కేసు ఫైలు చేసి ఆ భూమిని చేజెక్కించుకుందని తెలిపారు. తక్షణం తమ భూమిని అప్పగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశామని వివరించారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో తామే ఉన్నామని రోడ్లు, కరెంట్ వేయించుకున్నామని, ఇళ్లు కట్టుకోవాలని చూస్తుంటే ఆటంకాలు సృష్టిస్తున్నారని పేర్కొంటూ నూర్ సహా మరో నలుగురు మైనారిటీ ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న మైనారిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు షేక్ నూర్ అహ్మద్

కైలాసగిరిపై తవ్వకాలు ఆపాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చినగదిలి మండలంలోని సర్వే నెంబర్ 150లో నిబంధనలకు విరుద్ధంగా కైలాసగిరి కొండను తవ్వేసి వ్యాపారాల కోసం చేపడుతున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి రుషికొండలో పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడుతున్నారన్నారు. ఎయులోని చెట్లను కొట్టేసి పర్యావరణానికి విఘాతం కలిగించినా పట్టించుకోని ప్రభుత్వ ఉన్నతాధికారులపై తాము పోరాడుతున్నామన్నారు.

వరుణ్ బజాజ్‌లో పండగ ఆఫర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వరుణ్ బజాజ్ దసరా సంబరాల్లో భాగంగా తమ వద్ద ఆటో కొనుగోలు చేసిన వారికి పలు ఆఫర్లను ప్రకటించింది. ఆ వివరాలను వరుణ్ బజాజ్ ఆటో వింగ్ జనరల్ మేనేజర్ వంశీ సోమవారం తెలిపారు. ఆఫర్లలో ప్రధానంగా తమ వద్ద ఫైనాన్స్‌పై ఆటో కొనుగోలు చేసిన వారికి ఫైనాన్స్ డాక్యుమెంటేషన్ ఛార్జీలు ,మొదటి వాయిదా ఉచితమని పేర్కొన్నారు. దీంతోపాటు మొదటి ఆరు సర్వీసులు అందిస్తామని తెలిపారు. ఆన్ రోడ్ డౌన్ పేమెంట్‌పై రూ.33 వేల వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తున్నామని తెలిపారు. క్యాష్ లేదా బ్యాంకు లోన్‌పై కొనుగోలు చేసే వారికి రూ.8 వేలు విలువ చేసే మొదటి ఆరు వాయిదాలతో పాటు ఐదు లీటర్ల డీజిల్ ఉచితంగా ఇస్తున్నామని, వీటితో పాటు పలు క్యాష్ బ్యాక్ ఆఫర్లు కూడా అందిస్తున్నామని వెల్లడించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30 వేల ఉపాధ్యాయ పోస్టులను మెగా డిఎస్‌సి ద్వారా తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఎబివిపి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. స్పందన హాలులో బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అక్కడ చేరుకొని వారందరినీ అదుపులో తీసుకొని పోలీస్ బ్యారెక్స్ కల్యాణ మండపానికి తరలించారు.

పేద రైతులా.. బడా బాబులా తేల్చుకోవాలి?

ఎమ్మెల్యేకు ఇనాం రైతుల సూటి ప్రశ్న

ప్రజాశక్తి -తగరపువలస : తాత ముత్తాతల నుంచి తమ అనుభవంలో ఉన్న ఇనాం భూములపై తమకు పూర్తి హక్కులు ఉండగా, తమ భూములను చట్ట విరుద్ధంగా క్రయ విక్రయాలు జరిపిన బడాబాబుపై ప్రేమ ఒలక బోయడంలో ఆంతర్యం ఏమిటని సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, పలువురు ఇనాం భూ సాగు దారులైన రైతులు కనకల వెంకట రమణ, అల్లు చిన్నయ్య, కాళ్ళ ఆదినారాయణ, కనకల సన్యాసి నాయుడు తదితరులు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సూటిగా ప్రశ్నించారు. పేద రైతుల పక్షాన ఉంటారా? రైతులను మోసగించిన బడా బాబు పక్షం ఉంటారో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల లక్ష్మీపురంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాల్గొని నారాయణ రాజు పేట ఇనాంభూములకు సంబంధించి బడా బాబుకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి కైనా సరే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యేను కోరారు. అలా కాని పక్షంలో వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతామని ఖరా ఖండిగా తేల్చి చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రవ్వ, రైతులు

నేరాలు ఘోరాలు

24 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చీడికాడ: అక్రమంగా అడ్డదారిలో గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని చీడికాడ ఎస్సై రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో చీడికాడ మండలం అర్జునగిరి గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులను 24 కేజీల గంజాయి తో పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుండి రూ.45 వేలు, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండుక్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకి చెందిన వ్యక్తులుగానూ, మిగతా ఇద్దరిలో ఒకరు మాడుగుల మండలం కోటపాడు కి చెందిన వ్యక్తి కాగా మరొకరు చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూలి విద్యార్థి మృతి

ప్రజాశక్తి పాయకరావుపేట: స్థానిక పట్టణ దుర్గ నగర్ ఎంపీయూపీ స్కూల్లో విషాధం చోటుచేసుకుంది. పాయకరావుపేట దుర్గా నగర్ లో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చదువుతున్న తులసి సిద్ధూ ప్రసన్న (8)పై ప్రహరీ గోడ కూలి మృతి చెందినట్లు పాయకరావుపేట ఎస్సై రమేష్ తెలిపారు.పోలీస్‌ల కథనం మేరకు దుర్గా నగర్ లో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాల లో చదువుతున్న విద్యార్థి తులసి సిద్దు ప్రసన్న తలపై నిర్మాణంలో ఉన్న భవనం పై స్లాబ్ రాయి ప్రమాదవశాత్తు పడి గాయం కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలియజేశారు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

ప్రజాశక్తి- ఆనందపురం : ఒక హత్య కేసులో ఆనందపురం గ్రామానికి చెందిన బోద రామునాయుడుకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ నాలుగో అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.శ్రీహరి తీర్పునిచ్చారు. తీర్పు వివరాలను స్థానిక పోలీసులు మీడియాకు విడుదలచేశారు. 2012వ సంవత్సరంలో ఆనందపురంలో మీసాల సూర్యనారాయణ, మీసాల అప్పలనాయుడుకు బోద రామునాయుడుకు వివాదం తలెత్తింది. ఈ వివాదంలో మీసాల అప్పలనాయుడు, మీసాల సూర్యనారాయణపై బోద రామునాయుడు గొడ్డలితో దాడిచేశాడు. ఈ ఘటనలో మీసాల అప్పలనాయుడు మృతి చెందాడు. దీనిపై ఆనందపురం పోలీసులు విచారణ అనంతరం కేసు కట్టారు. కోర్టు విచారణలో సదరు వ్యక్తి పాత పగతో హత్య చేసినట్లు రుజువు కావడంతో బోద రామునాయుడుకు పై విధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : వేములవలస బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర సోమవారం మధ్యాహ్నం టాటా ఏసీ వ్యాన్ స్తంభాన్ని ఢీకొనడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆనందపురం నుంచి తగరపువలస వైపు వెళ్తున్న టాటా ఏసీ వ్యాన్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొనడంతో అది నేలకు ఒరిగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. నిత్యం వివిధ పనులతో బిజీగా ఉండే ఆనందపురం కూడలిలో విద్యుత్‌కు అంతరాయం కలగడంతో బ్యాంకులు, జిరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోలు, జ్యూస్ షాప్‌లకు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డారు. వేసవిని తలపించే ఎండలతో ఇళ్లల్లో చిన్నపిల్లలు, వృద్ధులు ఫ్యాన్లు లేక ఉక్కిరిబిక్కిరయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి కొత్త స్తంభం ఏర్పాటుచేసి సాయంత్రం 6 గంటలకు సరఫరాను పునరుద్ధరించడంతో వ్యాపారస్తులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కిక్ బాక్సింగ్‌లో హర్షవర్ధన్ ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల ఎంపిసి మొదటి ఏడాది విద్యార్థి బుడుమూరు హర్ష వర్ధన్ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ బి.నరసింగరావు సోమవారం తెలిపారు. ఇందుకు గాను ప్రోత్సాహకంగా విద్యార్థి హర్ష వర్ధన్‌కు రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. క్రీడా రంగంలో రాణిస్తున్న విద్యార్థులకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న కళాశాల చైర్మన్ నరసింగరావు

స్పందనకు 6 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు 6 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, ఇంజనీరింగ్ విభాగం-3, రెవెన్యూకు సంబంధించి 1 అర్జీలు అందాయి. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ రాము తెలిపారు.

పిఎం పాలెం : జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 17 వినతులు అందాయి. 7వ వార్డులో మల్లయ్య పాలెం ప్రాంతంలో తాగు నీటి సమస్యపై జనసేన నాయుకులు వినతి అందించారు. కొమ్మాది జాతీయ రహదారి సమీపంలో ఉన్న బిస్మిల్లా బిర్యానీ పాయింట్ యజమాని రోడ్డును ఆక్రమిస్తున్నారని సాయిరామ్ కాలనీకి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు.

10న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస బొగ్గు రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ బి.నరసింగరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నుంచి 2023 వరకు ఉత్తీర్ణులైన బిఎ, బికాం, బిఎస్సీ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9949394591 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి పిఎన్ఎం ఉన్నత పాఠశాలలో సోమవారం విశాఖ ఐ హాస్పిటల్ సహకారంతో శ్రీ సత్య సాయి సేవా సమితి, మోషన్ స్కూల్ హెల్త్ కేర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 303 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా ఆరుగురికి కంటి అద్దాలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. పిఎన్ఎం హైస్కూల్ హెచ్ఎం తిరుమల శ్రీదేవి, విశాఖ ఐ హాస్పిటల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ ఎం.సూరిబాబు, సేవాదళ్ కో-ఆర్డినేటర్ బిఎంఎన్.మూర్తి, జోనల్ కో-ఆర్డినేటర్ ఎంవి.సత్యసాయికుమార్ పాల్గొన్నారు.

120 మందికి కంటి అద్దాల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన 120 మందికి సోమవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ నెల 1వ తేదీన దివీస్ ఆధ్వర్యాన చిప్పాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించిన విషయం విదితమే. సోమవారం చిప్పాడలో నిర్వహించిన సభలో సర్పంచ్ వెంపాడ రమావతి ద్వారా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఎస్ఆర్ ప్రతినిధులు నాగరాజు, నరసింహారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ చర్యలు

ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు తప్పవని భీమిలి ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్రమంగా గ్రావెల్ తవ్వినా, తరలించినా జరిమానా విధింపు, వాహనాలు సీజ్ వరకు చర్యలు ఉండేవని, ఇకనుంచి పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో వేసిన లే-అవుట్‌లలో ఇప్పటి వరకు సుమారు 60 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చేతులు శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పాఠశాల ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జికె.దుర్గాభవాని చెప్పారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మ్యాజిక్ బస్ ఆధ్వర్యాన సోమవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆహారం తినే ముందు, తరువాత తమ చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి అన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్ టిఎంఒ ఆర్.శంకర్, డి.సాయిరాం, కె.యూష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి 5వ వార్డు పరిధిలో తాగునీటి బోర్లు ఏర్పాటుకు సోమవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత కౌన్సిల్ సమావేశాలలో వార్డులో తాగునీటి ఇబ్బందులు గురించి ప్రస్తావించగా చేతి పంపు బోర్లు మంజూరయ్యాయని తెలిపారు. వైఎస్ఆర్ కాలనీ, స్వాతంత్ర నగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ పిపి 2 కాలనీలలో చేతిపంపు బోర్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు. ఇంకా వార్డులో చాలా చోట్ల తాగునీటి పైపు లైన్లు, చేతి పంపు బోర్లు అవసరం ఉందని, వాటి గురించి కూడా మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని, తొందరలోనే మంజూరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వియ్యపు నాయుడు, ఓలేటి శ్రావణ్, నూకరాజు, మాదాల విజయ్, మోహన్, మహమ్మద్ అలీ, మురళి, కోళ్ల వెంకటేష్, పిళ్ళా అప్పన్న, కందుల సత్యనారాయణ, పెంటరావు, చందు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బోర్లు తవ్వకాలకు భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ హేమలత

పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్ షాప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థినులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా మౌలిక పరీక్షల అంశంపై గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సత్యనారాయణ, రాత పరీక్ష అంశంపై లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.భుజంగరావు ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, శాఖాధిపతి డాక్టర్ జి.పద్మావతి ఆధ్వర్యాన వర్క్ షాప్ నిర్వహించారు.

లొడగలవానిపాలెంలో దేవీ నవరాత్రుల రాట

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం గ్రామపంచాయతీలో దేవీ నవరాత్రుల ఏర్పాటుకు సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ దంపతులు ఆధ్వర్యాన ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ముహూర్తపు రాట వేశారు. పురోహితులు గౌతమ్ సాయి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు లోడగల అప్పలనాయుడు, లోడగల వెంకట్రావు, బమ్మిడి శ్రీధర్, లోడగల సన్యాసి, లోడగల సురేష్ కుమార్, లోడగల శ్రీను, లోడగల రాము, గొలగాని అప్పారావు, అలబోయిన రమణ, ముద్దాడ సన్యాసిరావు, గొలగాని సన్యాసి, నమ్మి శ్రీను, లోడగల ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ

విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ



సోలార్ పవర్‌పై మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి-సీతమ్మధార : సోలార్ విద్యుత్తు వాడకం వల్ల కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఇఎఎస్ శర్మ అభిప్రాయపడ్డారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో డిసెంట్రలైజ్‌డ్ సోలార్ పవర్ సిస్టం అంశంపై సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎఎస్ శర్మ మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ చాలా చౌక అని చెప్పారు. సోలార్ సిస్టమ్‌ను కార్పొరేట్ కంపెనీలకే కాకుండా, స్వతంత్రంగా గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలార్ సిస్టమ్ వాడకాలను ప్రారంభిస్తే కరెంట్ అవసరం ఉండదన్నారు. సోలార్ పవర్‌ను అభివృద్ధి చేస్తే ఆర్థిక అవసరాలు మెరుగుపడతాయని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అధిక భాగం విద్యుత్తును థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి చేసుకుంటున్నామని గుర్తు చేశారు. థర్మల్ పవర్ ద్వారా ఒక మెగా వాట్ సామర్థ్యానికి రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్లు పెట్టుబడి అవుతుందన్నారు. బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ఖర్చు పెరుగుతుందని తెలిపారు. పవర్ స్టేషన్ల ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చించే నిధుల నుంచి రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్లను గ్రామీణ స్థాయిలో నెలకొల్పేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు తయారుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం అనకాపల్లి నేత కాండ్రేకుల వెంకటరమణ, కిసాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అక్కినేని భవాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న వార్డు, నివాస్ ప్రతినిధులు

దుర్గానగర్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 71వ వార్డు పరిధి దుర్గానగర్ సెంటర్‌ను వార్డు, నివాస్ ప్రతినిధులతోపాటు, సచివాలయం అడ్మిన్ కూడా సోమవారం పరిశీలించారు. 100 అడుగుల రోడ్డులో భారీ వాహనాలను అనుమతించరాదని, దానికి ప్రత్యామ్నాయంగా వేరే రహదారి ద్వారా రాకపోకలు సాగించాలని వారం రోజుల క్రితం కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. దుర్గానగర్ సెంటర్ నుంచి రైల్వే క్వార్టర్ - కొత్తగా నిర్మించిన స్టీల్ ప్లాంట్ రిజ్వాయర్ పక్క నుంచి వడ్లపూడి సిగ్నల్ వరకు రోడ్డు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వాయిస్ ఆఫ్ గాజువాక నుంచి బి.త్రినాథ స్వామి, వార్డు, నివాస్ ప్రతినిధులు డాక్టర్ రమేష్‌కుమార్, కిరీటం, పరశురామ్, సత్యనారాయణ, పాలూరు లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర విభాగంలో 2 నుంచి జాతీయ సదస్సు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు ద్రవ స్ఫటికలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వీసీ తెలిపారు. కార్యక్రమానికి డిఎస్‌టి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ, నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యాన మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జివిఎంసి అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం ఫలితంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలకు అడ్డు ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో సిసి కెమెరాలకు అడ్డుగా ఉంటున్న చెట్ల కొమ్మలను నాలుగో పట్టణ సిఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యాన సోమవారం తొలగించారు. కొమ్మలు అడ్డుగా ఉండటంతో సిసి కెమెరాలు రోడ్డుపై వాహనాల రాకపోకలను రికార్డు చేసేందుకు ఇబ్బందులు వస్తున్నాయని సిఐ వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో పట్టణ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి శారదాపీఠంలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-పెందుర్తి : శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి తెలిపారు. 24వ తేదీ విజయదశమి వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. 20వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజ, సామూహిక అక్షరాభ్యాసములు నిర్వహించనున్నామని వివరించారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94403 93333 నెంబరును సంప్రదించాలని సూచించారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉల్లాస జీవితం

కిమ్స్ ఐకాన్ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ భగవాన్



ప్రజాశక్తి -గాజువాక : మానసిక ఆరోగ్యంతోనే ఉల్లాసమైన జీవితం గడపవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ సైక్రియాటిస్ట్ డాక్టర్ భగవాన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 26.4 కోట్లమంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారని తెలిపారు. మానసిక సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. శారీరక అనారోగ్యాల పట్ల ఉన్నంత అవగాహన మానసిక అనారోగ్యాల పట్ల ప్రజలకు ఉండటం లేదని తెలిపారు. జన్యుపరమైన కారణాలు, పుట్టిపెరిగిన వాతావరణం, జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలు... ఇలా పలురకాల అంశాలు మానసిక సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ఎవరిలోనైనా మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పలురకాల వైద్యపరమైన సంక్లిష్టమైన అంశాలు మానసిక సమస్యలకు కారణమవుతుంటాయని వివరించారు. మానసిక సమస్యలకు చికిత్సలున్నాయని, సరైన చికిత్స, శ్రద్ధ, అండదండలు ఉంటే మానసిక అనారోగ్యాలనుండి బయటపడటం, వాటిని నియంత్రణలో ఉంచుకుంటూ సాధారణ జీవితాన్ని గడపటం సాధ్యమవుతుందని తెలిపారు.

11న సత్యనారాయణ సంతాప సభ

ప్రజాశక్తి -గాజువాక : మిందిలోని గురజాడ కళాక్షేత్రంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు సిపిఎం సీనియర్ నాయకులు, కీర్తిశేషులు పైడా సత్యనారాయణ సంతాప సభ నిర్వహించనున్నట్లు అరుణోదయ కళా సమితి కార్యదర్శి వర్రి వెంకట్రావు తెలిపారు. ఈ సంతాప సభకు ఆయన అభిమానులు, మింది స్థానికులు పాల్గొనాలని కోరారు.



ముఖ్యమంత్రిని కలిసిన కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన వైసిపి రాష్ట్ర స్థాయి ప్రజా ప్రతినిధులు సదస్సులో ఉత్తర నియోజకవర్గ నాయకులతో కలిసి పార్టీ సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

పెందుర్తి - ఎన్ఎడి రోడ్డును బాగుచేయాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : నగర పరిధిలో అత్యంత రద్దీగా ఉండే పెందుర్తి నుంచి ఎన్ఎడి వరకు రోడ్డు చాలాచోట్ల శిథిలమై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే బాగుచేయాలని సిపిఐ పెందుర్తి శాఖ కార్యదర్శి ఆసిరినాయుడు, బర్డన్ నగర్ కార్యదర్శి అన్నపూర్ణ సోమవారం జివిఎంసి జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో అనేక చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని, చాలాసార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సిపిఐ నాయకులు ఆరోపించారు. ఈ రోడ్డును బాగుచేసి ప్రయాణికుల కష్టాలను గట్టెక్కించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాపు కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-పద్మనాభం : కోడిపుంజు దొంగిలించాడని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు అతిగా ప్రవర్తించి థర్డ్ డిగ్రీ ఉపయోగించి కాలు విరగ్గొట్టిన మండలంలోని బాందేవుపురం గ్రామానికి చెందిన బి.పాపు కుటుంబానికి విశాఖపట్నం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, డికెఎస్ఎస్, జై భీమ్ యువజన సంఘం సహాయం అందించాయి. ఆయా సంఘాల సభ్యులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేలు, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బొడ్డు కళ్యాణరావు, జెవి ప్రభాకర్, పతివాడ రాంబాబు, మద్ది చంటి బొడ్డు రాజు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన సోమవారం పలుచోట్ల కరపత్రాల పంపిణీ, ధర్నా తదితర కార్యక్రమాలు చేపట్టారు.



కొత్తగాజువాకలో ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

మధురవాడ : మధురవాడ సిపిఐ కార్యాలయం నుంచి మార్కెట్ ఏరియా స్వతంత్రనగర్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఇళ్లు, దుకాణాలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని విద్యుత్ దోపిడీ సాగిస్తున్నాయని విమర్శించారు. గతంలో వాడుకున్న కరెంటుకు తదుపరి భారం వేసే విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును కొనసాగించాలని, ఎస్సీ, ఎస్టీలు, వత్తిదారులకు 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్తు రాయితీని అందించాలని, 200 యూనిట్లు లోపు పేదలందరికీ ఉచిత విద్యుత్ అందించాలని, విద్యుత్ సవరణ బిల్లు - 2022ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచారంలో సిపిఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కొల్లి మేఘారావు, జి.వేళంగినిరావు, పిళ్ళా అప్పన్న, పెంటపల్లి కాంతమ్మ, షేక్ కాలిషా, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్, చింతలలోవలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సత్యాంజనేయ, రాంబాబు, గండి అప్పారావు, ఎన్‌వి.త్రినాథ్, కనకరాజు, డి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : కొత్త గాజువాక కూడలి వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, కె.అచ్యుతరావు, పల్లేటి పోలయ్య, పప్పు అప్పారావు, సోమేష్, వై.దేముడు, కె.వనజాక్షి, పిల్లా సూర్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ సిపిఐ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.రెహ్మాన్, దేవుడమ్మ, కాసుబాబు, చిరంజీవి, కె.సందీప్‌కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ రియాలిటీపై గీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులలో వర్చువల్ రియాలిటీ ఒకటి అని, దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని అవకాశాలను విస్తృతం చేసుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెన్త్ లైన్ పేర్కొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) గీతం విద్యార్థి విభాగం ఆధ్వర్యాన సోమవారం వర్చువల్ రియాలిటీపై వర్క్ షాప్ నిర్వహించారు.

మీడియాపై దాడులు అమానుషం

న్యూస్ క్లిక్ ఎడిటర్ అక్రమ అరెస్టుపై సిఐటియు నిరసన



సిఐటియు ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

మోడీ ప్రభుత్వంలో పత్రికా రంగంపై దాడులు పెరగడం అమానుషమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కథనాలు రాసిన న్యూఢిల్లీలోని న్యూస్ క్లిక్ ఎడిటర్ పుర్కాయస్థపై కక్ష కట్టిన మోడీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ ఎడిటర్ పుర్కాయస్థ అరెస్టు పత్రిక రంగానికి, మీడియా రంగానికి ఆందోళన కలిగిస్తున్న అంశమన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి కాంతారావు మాట్లాడుతూ మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా మీడియాపై దాడులకు పాల్పడిన సంగతిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు ఈశ్వరరావు, అల్లు రాజు, విలేకరులు ఎం.అజయ్, ఆత్మారాం, అనకాపల్లి రామస్వామి, రమణ, శ్రీనివాస్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బి.నూక అప్పారావు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన నిరసన

ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టును నిరసిస్తూ, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనం నుండి నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, ఏవో రవి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయన్నారు. ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.కాంతారావు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమాలకు అనుకూలంగా వార్తలు రాయడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనపై కక్ష సాధింపునకు పూనుకుంటుందని విమర్శించారు. మీడియాపై దాడులు, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు, కార్యదర్శి పి.రామకృష్ణ, ఫెడరేషన్ ప్రతినిధులు మార్పూరు అజయ్, గంటా శ్రీనివాసరావు, బాషా, రాజా, రమేష్, పి.నాగ, కె.మోహన్ బాబు, పి.రామారావు, కె.గణేష్, పి.సత్యనారాయణ, నటరాజ్, గంగాధర్, బొడ్డేడ శ్రీను, నాయుడు, కుమార్, మణి కుమార్, ఎన్.వెంకటరమణ, దేవుడు బాబు, స్వామి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన ఆర్‌డిఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు

'అటల్ టింకరింగ్'లో ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : జాతీయస్థాయిలో జరిగిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాజెక్టులో సబ్బవరం ప్రతిభ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రీజనల్ మెంటర్ వి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏటిఎల్ మారథాన్ 2023 సంవత్సరానికి గాను భారతదేశంలో సుమారు 8 వేల టీములు రాగా అందులో 400 మంది ఎంపిక కాగా, ఇందులో సబ్బవరం ప్రతిభ విద్యాలయం విద్యార్థులు మూడు టీములుగా తొమ్మిది మంది ఎంపిక కావడం హర్షనీయమన్నారు. వీరికి హైదరాబాదులోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటిఎల్ మెంటర్ ఎస్.అనుపమరాణి, పాఠశాల ఉపాధ్యాయులు అనిత జ్ఞానేశ్వరి, కనకమహాలక్ష్మి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబద్ధాన్ని నిజమని నమ్మించడంలో జగన్ దిట్ట

ప్రజాశక్తి-అనకాపల్లి : పచ్చి అబద్ధాన్ని సైతం నిజమని నమ్మించి జనాలను మోసం చేయడంలో జగన్ రెడ్డిని మించిన వారు లేరని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అసలు రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి? విభజన చట్టంలోని హామీలను కేంద్రం నుండి సాధించడంలో విఫలమైనందుకా? రూ.32వేల కోట్ల విలువైన గంగవరం పోర్టు ప్రభుత్వ ఆస్తిని కారు చౌకగా అదానీకి రూ.646 కోట్లకు కట్టబెట్టినందుకా? విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రంపై ఒత్తిడి తేనందుకా? సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఉద్యోగులను నమ్మించి మోసగించినందుకా? పోలవరం ప్రాజెక్టును, అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసినందుకా? చక్కెర ఫ్యాక్టరీలు ఆధునికీకరణ చేస్తామని చెప్పి మోసగించి మూసివేసినందుకా? అని నాగజగదీశ్వరరావు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ అవసరం లేదని, ఆయనకు బై బై చెప్పే రోజులు వచ్చాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు, కడిమిశెట్టి సింగ్, దాడి జగన్, బుద్ధ మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-అనకాపల్లి

దక్షిణాఫ్రికాలో జరిగిన ఐదవ ప్రపంచ కప్ టెన్నీ కాయిట్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఆర్.మౌనిక, జి.హేమమాదిరి, పిజిఎండి రామారావు, వి.వినయ్ కుమార్‌లకు విశాఖపట్నం విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో కర్షక దేవోభవ కన్వీనర్ ఆడారి కిషోర్ కుమార్, ఎపి టెన్నీ కాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎస్‌వి సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి పి.తవిటయ్య, రాష్ట్ర కబడీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎంవి నాగేశ్వరరావు, విజయనగరం జిల్లా కార్యదర్శి కె.రామారావు, బీడీ సాగర్, జి రాజు, ఎం శ్రీనివాసరావు, ఎం తిరుపతిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ధర్నాలో పాల్గొన్న జిల్లా ఎల్ఐసి ఏజెంట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జీవిత బీమా ఏజెంట్లు సోమవారం హైదరాబాద్‌లోని ఎల్ఐసి జోనల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అనకాపల్లి బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదు నాయుడు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా సైదునాయుడు మాట్లాడుతూ బీమా రంగంలోని అన్ని లావాదేవీలపై జీఎస్టీని తొలగించాలని, డైరెక్ట్ మార్కెటింగ్, ఇన్సూరెన్స్ పాలసీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెంట్లు పీలా శ్రీనివాసరావు, రొంగలి వెంకట్రావు, గైపూరి భాస్కరావు, నరాలశెట్టి బాబురావు, కొణతాల నూక అప్పారావు, కేవియస్ మురళి, బి మారాజు, బి లోవరాజు, కెఎల్‌ఆర్‌కే నాయుడు, యు.సత్యనారాయణ, ముమ్మన అప్పారావు, యల్ నాగేశ్వరావు, యస్ సత్యారావు, వి కన్నారావు, మావుళ్ళ, అలంక నాగేస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి

- పని ఒత్తిడి కారణంగానే.. : ఆశా వర్కర్స్ యూనియన్
- మాణిక్యమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లా తగరంపూడి పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తగా పని పనిచేస్తున్న కుంచంగి ఎస్సీ కాలనీకి చెందిన గోరింతల మాణిక్యమ్మ (55) గుండెపోటుకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి పరిస్థితి విషమించి మరణించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సర్వేలు చేస్తూ విపరీతమైన పని భారం కారణంగా ఒత్తిడికి గురి కావడంతో మాణిక్యమ్మకు వారం క్రితం గుండెపోటు వచ్చిందని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. మాణిక్యమ్మ భౌతిక కాయానికి కుంచంగి గ్రామంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శాంతి, పిహెచ్‌సి పరిధిలోని ఆశా కార్యకర్తలు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఆమె మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా ఆశా వర్కర్‌గా పనిచేస్తూ తన జీవితాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు అంకితం చేశారని తెలిపారు. ఇద్దరు ఆడపిల్లలతో జీవిస్తున్న మాణిక్యమ్మ కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని, పిల్లలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాణిక్యమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆశా వర్కర్లు

ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం రాజం గ్రామంలో దళితుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన గ్రామ తలయారీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజాం గ్రామానికి చెందిన ప్రజలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వారికి ఎపి దళిత వేదిక, ఏపీ ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీల రాజ్యాధికార వేదిక నేతలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అనకాపల్లి శ్రీనివాసరావు, సూరకొండ మాణిక్యాలరావు, ఉడిగంల నాగేంద్ర కుమార్, కొల్లి సత్యారావు, గ్రామానికి చెందిన కుర్రం రమణ, కుర్రం లక్ష్మి, కుర్రం ప్రసాద్, గొట్టల ఉష, గాడి సూర్యకళ, కుర్రం సత్యవతి, కుర్రం కుమారి పాల్గొన్నారు.

సత్యనారాయణ దేవస్థానానికి సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భక్తులు సౌకర్యార్థం రెండు సిమెంటు బెంచీలను పూసర్ల అప్పనర్సమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త, ప్రముఖ వ్యాపారవేత్త పూసర్ల కృష్ణ బ్రదర్ అండ్ సన్స్ సమకూర్చారు. వీటిని సోమవారం ఆలయ చైర్మన్ కెఎం నాయుడు ఆధ్వర్యాన దేవాలయంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు మారిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది శంకర్రావు, పూసర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

12న జనరాజు దాస్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ పెంటకోట జనరాజుదాస్ 64వ జయంతి వేడుకలు ఈ నెల 12న మునగపాకలో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయంతిని పురస్కరించుకుని ఆ రోజు రాత్రి 7 గంటలకు నందీశ్వర కళా ప్రాంగణం (తులసి కళావేదిక)పై కళాంజలి హైదరాబాదు వారిచే "రైతే రాజు", "మనిషి మంచోడే" అనే సాంఘిక నాటికలు ప్రదర్శింపబడతాయని పేర్కొన్నారు. కళాభిమానులు, కళాకారులు, దాసు మిత్రులు ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వరి పంటకు తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వై.ఎల్ కాంతమ్మ అన్నారు. ప్రస్తుతం బాగా దుబ్బు చేసి ఉన్నాయని, ఈ దశలో కొన్ని రకాల తెగుళ్ల సోకే అవకాశం ఉందని, వాటిని తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఆమె వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాసి తెగులు (పాము పొడ తెగులు)కు పొడపాము మచ్చలు ఉన్నట్లు ఆకులమీద దుబ్బులు మొదళ్ల మీద ఎక్కువ వస్తున్నాయి, వీటి నివారణకు ఎకరాకు 400 మిల్లీ లీటర్ల ప్రొఫికోనజోల్, 200 మిల్లీ లీటర్ల అజ్సాస్ట్రోబిన్, వరి దుబ్బులు తడిసే విధంగా స్ప్రే చేయాలని సూచించారు. అగ్గి తెగులు ఆకు మీద గోదుమ రంగు అంచుతో మధ్యలో బూడిదరంగు కలిగిన మచ్చలు ఉంటాయని, ఆకు ఎండి పోయి కాలిపోయి నట్టు కనిపిస్తే - ట్రైసైక్లోజోలు మందును ఎకరానికి 120 గ్రాములు, స్ప్రే చేయాలన్నారు. ఆకుముడతపురుగు గొంగళి పురుగు ఆకులను మడిచి లోపల ఉన్న పత్ర హరితాన్ని గోకితినడం వల్ల ఆకులు తెల్లగా కనిపిస్తాయని, దీనికి క్లోరిపైరిఫోస్ మందును ఎకరానికి 500 ఎంఎల్, ప్రొఫైనోఫోస్ - 400 ఎంఎల్ మంక్రోటోఫాస్ 320 ఎంఎల్ రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.



వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కాంతమ్మ



కాన్షీరామ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న బిఎస్‌పి నేతలు

కాన్షీరామ్‌కు నివాళి

ప్రజాశక్తి- కె.కోటపాడు : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ 17వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఎ.కోడూరు ఎస్సీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద బిఎస్‌పి నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వారసత్వాన్ని అందిపుచ్చుకొని చివర వరకు పోరాడిన యోధుడు కాన్షీరామ్ అని కొనియాడారు. పీడిత జనులను నాయకులుగా చూడాలని డాక్టర్ అంబేద్కర్ కలలను నిజం చేయడమే కాకుండా పీడిత కులాలను ఏకం చేసి రాజ్యాధికారం వచ్చేలా ఎంతో కృషి చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు గుడే చిన్నారావు, పరవాడ అప్పారావు, పల్లా అప్పలస్వామి, గోకడ సన్యాసినాయుడు, కె అప్పలరాజు, రామచంద్రరావు, గోటువాడ సుహాసిని, శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారు చేయడానికి వంట పాత్రలు అందిస్తున్నట్లు మండల విద్యా శాఖ అధికారులు బి.పడాల్ దాసు, వి.ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్న మధ్యాహ్న భోజన సిబ్బందికి ఇది శుభవార్తగా వారు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన అల్యూమినియం పాత్రలను కాకుండా నాణ్యమైన స్టీలుతో చేసిన పాత్రను అందిస్తున్నామని, సాంకేతికంగా వంటకు అనవుగా ఉండే వాటిని పరిశీలించి వాటిని ప్రభుత్వం సరఫరా చేసిందని వెల్లడించారు.

రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : పంట నమోదు చేసుకున్నా ప్రతి రైతూ రైతు భరోసా కేంద్రం వద్దకు ఆధార్ కార్డు పట్టుకొని వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. మండలంలోని మారేపల్లి, తెలుగుపూడి, దేవరాపల్లి గ్రామాల్లో సోమవారం వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆమె రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకోకపోతే రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునే అవకాశం ఉండదని, పంటల బీమా పరిహారం, పంట రుణాలు దక్కవని తెలిపారు. ఏఈఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఏర్పరుచుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : విద్యార్థి దశలోనే ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని నెరవేర్చేందుకు కష్టపడాలని ఇంటర్నేషనల్ ఆర్మీ కోచ్ పల్లా నాగార్జున అన్నారు. మండలంలోని స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో సోమవారం విద్యార్థులకు జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాను ఒక మారుమూల గ్రామంలో పుట్టి ఈ స్థాయికి ఎదిగిన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం అండర్-19లో రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు నాగార్జున చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ పి.మాణిక్యాలరావు, టిడిపి నాయకులు పల్లా తాతారావు, ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, డైరెక్టర్లు మీనాక్షి, లక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

సుంకరి సూరిబాబు ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ నాయకులు, బుచ్చయ్యపేట మాజీ సర్పంచ్ సుంకర సూరిబాబు ప్రథమ వర్ధంతి కార్యక్రమం సోమవారం బుచ్చయ్యపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు తదితరులు హాజరై సూరిబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు దొంకెన అప్పలనాయుడు, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు, దేవర తాతాజీ, శనివాడ శ్రీను, సుంకర శ్రీను పాల్గొన్నారు.

చే గువేరా అడుగుజాడల్లో నడవాలి



చే గువేరా చిత్ర పటానికి పూలమాల వేస్తున్న గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ

యువత చే గువేరా అడుగుజాడల్లో నడవాలని, ఆకలి లేని రాజ్యం కోసం పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని వాడచీపురుపల్లిలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చే గువేరా వర్ధంతి కార్యక్రమంలో చే చిత్రపటానికి గనిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొలీవియా విముక్తి పోరాటం చేస్తున్న చే గువేరాను అమెరికా ఆదేశాలతో బొలీవియన్ సార్జెంటు కాల్చివేసినట్లు తెలిపారు. టైం మ్యాగజైన్ చేత శతాబ్ది పురుషునిగా గుర్తింపు పొందిన చే గువేరా 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియోలో జన్మించినట్లు చెప్పారు. చిన్నప్పటి నుంచే ఆస్తమా వ్యాధిగ్రస్తుడైన చే లాటిన్ అమెరికా దేశాల విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. 'చే అంటే బొమ్మకాదు. ప్రపంచంలో ఎవరికైనా, ఎక్కడైనా అన్యాయం జరిగితే స్పందించడానికి సిద్ధంగా ఉండు అని ఒక స్ఫూర్తిని యువతలో రగిలించిన నిప్పురవ్వ, పోరాటయోధుడు, సాహస వీరుడు, చైతన్య రథ సారథి, ఆకలి లేని ప్రపంచం కోసం పరితపించే ఒక విప్లవ కెరటం' అని గుర్తించాలని గనిశెట్టి కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం, సిఐటియు నాయకురాలు కె.ఆదిలక్ష్మి, రత్నం, నూకరత్నం, కె.లక్ష్మి, జి.లక్ష్మి, జి.సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చేగువేరాకు డివైఎఫ్ఐ నివాళి

విశాఖ కలెక్టరేట్ : డివైఎఫ్ఐ కంచరపాలెం కమిటీ ఆధ్వర్యాన సోమవారం చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. బివిఎన్ఆర్ భవన్‌లో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు విజయ మాట్లాడుతూ, దక్షిణ అమెరికాలోని క్యూబాలో నియంత పాలనను వ్యతిరేకిస్తూ చేగువేరా విప్లవబాట పట్టారని, ఫిడేల్ కాస్ట్రో నిర్వహించిన ఉద్యమంలో యువతను తన ప్రసంగాలతో ఉరకలెత్తించారని తెలిపారు. ఉద్యమం తర్వాత ఫిడేల్ కాస్ట్రో ప్రభుత్వంలో మంత్రిగా, సెంట్రల్ బ్యాంక్ లీడర్‌గా చేగువేరా పనిచేశారని గుర్తుచేశారు. బొలీవియాలో పేదలకు న్యాయం జరగట్లేదని భావించిన ఆయన కాస్ట్రోని వీడి మళ్లీ విప్లవం వైపే అడుగులు వేశారన్నారు. మంత్రిగా మంచి హోదాలో ఉన్నప్పటికీ ఇతర దేశాల్లో పేద ప్రజల ఇబ్బందులను దూరం చేయటానికి సర్వం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కమిటీ సభ్యులు శరత్ మాట్లాడుతూ, నేడు దేశంలో రాజకీయాలు నియంతృత్వాన్ని తలపిస్తున్నాయన్నారు. యువత ఏకమై చేగువేరా స్ఫూర్తితో ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, అప్పలరాజు, రామారావు, సావిత్రి, యువతీ యువకులు పాల్గొన్నారు.



కంచరపాలెంలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, యువకులు

జగనన్న కాలనీకి తీసుకున్న భూమికి పరిహారం ఇప్పించండి

స్పందనలో కలెక్టర్‌కు బాధితుడు వినతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని తైపురం రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీ కోసం ప్రభుత్వం తమ డి.ఫారం భూమి తీసుకుందని, దానికి పరిహారం చెల్లించాలని, మిగిలిన భూమిని తన పేరుతో ఆన్‌లైన్ చేయాలని మండలంలోని రాజాం గ్రామానికి చెందిన దళితుడు నందికోళ్ల నూకరాజు, ఆయన భార్య భవాని సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఆర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో తన తండ్రి నందికొళ్ల సొంబయ్యకు తైపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 276-4లో 3.71 ఎకరాలు భూమికి డి-ఫారం పట్టా ప్రభుత్వం మంజూరు చేసిందని, ఖాతా నెంబరు 198గా ప్రభుత్వం తన తండ్రి పేరుతో పాస్ పుస్తకం ఇచ్చిందని తెలిపారు. ఈ భూముల్లో పండ్ల తోటలు పెంపకం చేపట్టామన్నారు. కుటుంబ అవసరాల రీత్యా తన తండ్రి ఈ భూముల్లో ఫలసాయానికి తాకట్టుగా తైపురం గ్రామానికి చెందిన అల్లం అప్పారావు వద్ద నగదు తీసుకున్నామని చెప్పారు. తన తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారని, తాను ఉపాధి కోసం



వినతిపత్రం చూపుతున్న బాధితులు నూకరాజు, భవాని

వలస వెళ్లిపోయానని తెలిపారు. 2020 సంవత్సరంలో తైపురం గ్రామంలో జగనన్న కాలనీకి ఎకరా 50 సెంట్లు భూమిని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని రాళ్ళ పాతారని తెలిపారు. సదరు భూమికి ప్రభుత్వం నుండి పరిహారంగా రూ.14 లక్షలు చెల్లిస్తామని తెలిపారని, కానీ నేటి వరకు పరిహారం అందలేదని పేర్కొన్నారు. అలాగే మిగులు భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తన పేరుతో మార్పు చేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన పట్టించుకోవటం లేదని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరారు.

అనకాపల్లిలో అన్ని రైళ్లు ఆపాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని, జిల్లా కేంద్రం అయినా ఇక్కడ అన్ని రైళ్లు ఆపడం లేదని ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు సన్మానాలు, సత్కారాలపై ఉన్న శ్రద్ధ అనకాపల్లి అభివృద్ధిపై లేదన్నారు. జిల్లా ప్రజలు రైలెక్కాలంటే విశాఖపట్నం వెళ్లాల్సి వస్తుందని, ముఖ్యమైన రైళ్లు అనకాపల్లి స్టేషన్లో ఆగేలా ఏ నాయకుడు ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అనకాపల్లిలో అన్ని రైళ్లు ఆగే విధంగా ఎంపీ, మంత్రి కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ సహకారంతో నందిని ఫౌండేషన్ ఆధ్వర్యాన కశింకోట బాలురు హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణ అధికారి ఎన్.రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలు పాటల్లో కూడా రాణించాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రభాకర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలించాలని నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం ఆవరణలో ఆహా క్యాంటీన్ ప్రారంభానికి వచ్చిన జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ కారు ముందు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాతరపల్లి వీరు యాదవ్ డంపింగ్ యార్డ్ తరలించాలని కోరుతూ ప్లకార్డుతో నిరసన తెలియజేశారు. ఈ సమస్యపై గతంలో ఎన్నోసార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వీరుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్లకార్డుతో నిరసన తెలియజేస్తే కమిషనర్ సాయి కాంత్‌వర్మ కనీసం స్పందించకపోగా, జోనల్ కమిషనర్, సిబ్బంది తన త్రిచక్ర వాహనాన్ని దౌర్జన్యంగా పక్కకు నెట్టి జివిఎంసి కమిషనర్‌కు తోవ కల్పించారని వాపోయారు.

త్వరలో అన్ని హంగులతో 'ఆహా క్యాంటీన్'

ప్రజాశక్తి - యలమంచిలి : అన్ని రకాల హంగులతో 'ఆహా క్యాంటీన్'ను త్వరలో తిరిగి ప్రారంభించనున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మేనేజర్ పద్మావతి సోమవారం తెలిపారు. యలమంచిలి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ కియోస్క్ (గుడారం) ఈదురు గాలులకు విరిగిపోవడంతో తాత్కాలికంగా మూతపడిందని, దాన్ని త్వరలోనే పూర్తి స్థాయిలో నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆమె వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న క్యాంటీన్ పరిశుభ్రమైన ఆహారం అందించాలని, అందుకు కొత్త మెనూ రూపొందిస్తున్నారని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లోనే కాకుండా రోజంతా తిను బండారాలు దొరికే స్టాల్‌గా రూపొందించడానికి నిర్వాహకులు సమాయత్తమౌతున్నట్లు ఆమె వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కశింకోట

అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్ 14, అండర్ 17 కత్తిసాము పోటీలలో కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14కు ఎం.శరత్, వై.కోటేశ్వరరావు, జ్యోత్స్న, అండర్ 17కు వై.చందురాజు ఎంపిక కాగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని పాఠశాల పిడి వి.ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, పివిఆర్.ప్రభాకర్, ప్రసాద్, ఆనంద్, అప్పారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేరి సుజాత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు తేజష్ ఎంపిక

కశింకోట : రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన కోసిరెడ్డి తేజష్ ఎంపికైనట్లు సోమవారం తల్లిదండ్రులు కోసిరెడ్డి తాతీయులు, శ్యామల దేవీ తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ నెల 7న విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలలో తేజష్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సంపాదించినట్లు చెప్పారు. తేజష్ ఆనందపురం మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. తేజష్‌ను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.



కోసిరెడ్డి తేజష్

'ఓట్ల కోసమే జనానికి డబ్బులు'

ప్రజాశక్తి-గొలుగొండ:ముఖ్యమంత్రి ఎన్నికల ముందు చెప్పిన మాటలకు ఇప్పుడు చేస్తున్న పరిపాలనకు పొంతన లేవని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆరోపించారు. గొలుగొండ సాయిబాబా గుడి వద్ద సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎల్.వి.రమణ అధ్యక్షతన జరిగిన జరిగింది. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాల పేరుతో అకౌంట్లో డబ్బులు వేసి ఓట్ల కోసం ఎరవేయాలని చూస్తున్నాయన్నారు.గ్యాస్, పెట్రోల్ ధరలు, విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలు అధిక ధరలతో సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సమితి సభ్యులు మేకా భాస్కరరావు, మేకా సత్యనారాయణ, లోకరపు అప్పలనాయుడు, జి.రాధాకృష్ణ, కిల్లాడ అప్పలనాయుడు, కూడా దొర, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమ్మాజీ

ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీ చేస్తా

- పెదపాటి అమ్మాజీ

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో నారా చంద్రబాబు నాయుడు అవినీతి చేసి రాష్ట్ర ప్రజల సొమ్మును తన సొంత ఖాతాలోకి జమ చేసుకొని జైలు పాలయ్యారని, ఈ విషయమై తమ పార్టీ నేతలను టిడిపి నేతలు విమర్శలు చేయడం తగదని రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ పేర్కొన్నారు. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ, చంద్రబాబుకు వేసిన క్వాష్ పిటిషన్లు, బెయిల్ రాలేదంటే ఎంత అవినీతి చేసి ఉంటాడో ప్రజల గమనించాలని అన్నారు. దేశం మొత్తం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వైపు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మహిళలకు ఆయన కల్పిస్తున్న సదుపాయాలను గమనిస్తున్నారన్నారు.తూర్పుగోదావరి జిల్లాలో వైయస్సార్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ అనేక పదవులను పొందిన తనకు పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తప్పకుండా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, జగన్మోహన్ రెడ్డి మాటే తనకు శిరోధార్యమని ఈ సందర్భంగా తెలిపారు.



హాజరైన అధికారులు, మహిళలు

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం కావాలని డిపిఎం కరుణానిధి సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో వివిధ గ్రామాల డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘాల బలోపేతానికి మహిళల ప్రధాన భూమిక పోషించాలన్నారు. మండలానికి శ్రీనిధి నిధులు 7కోట్ల లక్ష్యంగా పెట్టుకోగా ఇంతవరకు 5.81 కోట్లు రుణాలుగా అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇంతవరకు నూట నలభై ఎనిమిది సంఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వీఓవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన వినతులను పరిష్కరించాలి

- ఆర్‌డిఒ జయరాం
- రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. భూ సమస్యలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. నర్సీపట్నం కాపు వీధిలో విద్యుత్ లో వోల్టేజ్‌పై వినతులను స్థానికులు అందించారు. చెట్టుపల్లిలో విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని స్థానికులు వినతి పత్రం అందజేశారు. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ జయరాం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అన్నాజీరావు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నర్సీపట్నం అబీద్ సెంటర్లోని అయ్యప్ప స్వామి ఆలయం కొంత భాగం కూల్చివేతకు గురవుతుండటంపై టిడిపి నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో ఆర్డీవో జయరాం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. ఇప్పటికే నెల రోజులు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

పైబడి గడువు ఇచ్చామని, అయినప్పటికీ గుడి తొలగించలేదని తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గుడిలో ఉన్న అమ్మవారిని దేవాలయం ముఖద్వారం తొలగించడానికి కొంత సమయం కావాలని కోరారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని ఆర్డీవో వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో అన్నాజీరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ నమ్మి గణేష్, కమిషనర్ రవిబాబు, డీఈ నారాయణ, తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు దనిమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్, పైలా గోవింద్, చింతు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఈఒపిఆర్‌డి రఘు, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్, డాక్టర్ మధుసూదన్, వైసిపి మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామునాయుడు, సచివాలయం సిబ్బంది, , ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలో జెవిపాలెం గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు బాలమృతంతో తయారు చేసిన వివిధ రకాల పదార్థాలు స్టాల్‌లో ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో రామచంద్ర మూర్తి, వైద్యులు శక్తి ప్రియ, రాజేశ్వరి, శిరీష, భవాని, బి.వెంకటరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల జెడ్పి హైస్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 610 మందికి వైద్య పరీక్షలు చేసి, 33 కేసులను ఆరోగ్యశ్రీకి పంపించినట్లు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు, ఈవోపిఆర్‌డికే ధర్మారావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి, డాక్టర్ వాణి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దమదీన గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి,వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, సర్పంచ్ కెవిఆర్ నాయుడు, తహశీల్దారు వెంకటేశ్వరరావు, వైద్యాధికారి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు ప్రారంభించారు. సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, ఎంపిటిసి రాపేటి అరుణ రాము, తహసీల్దార్ బి సత్యనారాయణ, ఎంపీడీవో బి.రమేష్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని చింతలపాలెంలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 347 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు వైద్యాధికారులు రవితేజ, భానుప్రియ, రమేష్, వై యశోద, ఎమ్ఎస్‌వి ప్రసాద్, గ్రామ సర్పంచ్ కొట్టే రాము పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు ప్రారంభించారు. 650 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఎంపిడిఒ కె.లవరాజు, పంచాయతీ కార్యదర్శి కరుణాకరరావు, వైద్యాధికారులు డాక్టర్ ఎస్‌కె.షాహనాజ్, సిహెచ్‌ఒ సాంబమూర్తి, సాదియా, సౌందర్య పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని తునివలస పంచాయతీలో జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి స్వప్న వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఒ ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

టిడిపి నేతల నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు అరెస్టు అమానుషమని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ అన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ సోమవారం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన నిరసనలో ప్రసాద్ మాట్లాడారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సంఘీభావం తెలిపారు. పార్టీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పైలా నాయుడు, వాండ్రాసి అప్పలరాజు, తోట రత్నం, వెంకటరమణ పాల్గొన్నారు.

నక్కపల్లి:చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు సోమవారం నిరసన చేపట్టారు. మండలంలోని వేంపాడు నూకాలమ్మ ఆలయం వరకు టిడిపి, జన సైనికులు కలిసి బైక్ ర్యాలీ చేపట్టారు.చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు.అనంతరం నూకాలమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ, కనకారావు, అప్పలరాజు, పల్ల రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.



నక్కపల్లిలో ర్యాలీ చేపడుతున్న నేతలు

ఇళ్లపై విద్యుత్ వైర్లు తొలగించాలి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో వైయస్సార్ కాలనీలో ప్రజలు నివసిస్తున్న ఇళ్లపై నుండి, ఇళ్ళ మధ్య నుండి వేలాడుతున్న ప్రమాదకరమైన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైయస్సార్ కాలనీలో ప్రజల ఇళ్లపై నుండి ప్రమాదకర మైన విద్యుత్ వైర్లు వెళ్లడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ భయాందోళనలతో బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మిన సత్యవతి, మొల్లి లక్ష్మీ పాల్గొన్నారు.



విద్యుత్ వైర్లు పరిశీలిస్తున్న అప్పలరాజు



పందిరి రాటోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దసరా ఉత్సవాలకు రాట

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దేవవరం గ్రామంలో సోమవారం దేవీ నవరాత్రి వేడుకలకు సంబంధించి రాటోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, నర్సింహమూర్తి దంపతులు, మాజీ సర్పంచ్ దేవర సత్యనారాయణ, బలరామరాజు, ఆచంట రామకృష్ణ, మహిళలు పూజా కార్యక్రమాలు ని ర్వహించిన అనంతరం రాటోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23 వరకూ గ్రామస్తులందరి సహకారంతో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

'పార్టీ పనులకు వాలంటీర్లను వాడుకోవడం తగదు'

ప్రజాశక్తి -కొత్తకోట:గ్రామ, వార్డు వాలంటీర్లను వై సిపి పార్టీ కార్యక్రమంలో వాడుకోవడం తీవ్ర తప్పిదమని, ఈ విషయం పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పివి ఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం కొత్తకోటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం కొత్తకోట లో నిర్వహించిన ఏపీకి జగన్ నీఎం ఎందుకు కావాలి వైసిపి కార్యక్రమానికి వాలంటీర్లను ఎందుకు వాడుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. రోలుగుంట, రావికమతం మండలాల సంబంధించిన వాలంటీర్లను కూడా భాగస్వాములు చేసి వారికి రాజకీయ శిక్షణ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి పార్టీ కార్యకర్తలు, నాయకులు పెట్టుకున్న ఈ సమావేశానికి వాలంటీర్లను ఎలా భాగస్వామ్యం చేస్తారని ప్రశ్నించారు.ప్రభుత్వం నుండి గౌరవ వేతనం పొందుతున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని వాడుకోవడం తగదని తెలిపారు.

11న జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంకేంద్రంలో ఈనెల 11న ఉదయం 9 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్‌వి రామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొం టాన్నారన్నారు. మండలంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించవచ్చు అన్నారు. ఈ విషయన్ని గ్రామాల్లో దండారాలతో ప్రజలకు తెలియపరిచామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు హాజరు కావాలని ఆయన తెలిపారు.



బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో ముద్దుర్తి సనారి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైయస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10వేల తక్షణ సాయాన్ని సోమవారం సర్పంచ్ పోలిరెడ్డి రాజుబాబు చేతుల మీదుగా అందజేశారు. మిగిలిన సొమ్మును అకౌంట్లో జమ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు ఎర్రి నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ కూరాకుల రాజా, వాలంటీర్ రమణ పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి-నక్కపల్లి: వేసవిని తలపించే విధంగా భానుడు భగభగ మండుతున్నాడు. ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో కరువు ఛాయలు అలుముకున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వేసవిని తలపించేలా భానుడు తారెత్తిస్తున్నాడు. బయటకు రావాలంటే ప్రజలు హడలి పోతున్నారు. గత రెండు నెలల నుంచి నక్కపల్లి మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నెల ప్రారంభం నుంచి భానుడు ప్రచండ నిప్పులు కురిపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. కనిష్టస్థాయిలో వుండాల్సిన ఉష్ణోగ్రతలు అక్టోబరు నెలలో సగటున రోజూ 33 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వాతావరణం వేడిగా ఉంటుంది. వాతావరణం అగ్నిగుండంగా మారడంతో ఎండల్లో తిరిగిన వారు జ్వరాల బారిన పడుతున్నారు. పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు కూడా తీవ్రమైన ఎండలకు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. భవన నిర్మాణ కార్మికులు, కర్షకులు, వివిధ రంగాల కార్మికులు అక్టోబర్ నెలలో మునిపెన్నడు ఇటువంటి ఎండలు ఎప్పుడూ చూడలేదని అంటున్నారు. వర్షాలతో తడిసి ముద్దవలసిన పుడమి ఎండ వేడిమికి బీటలు బారుతున్నాయి. వరి చేనులతో పచ్చగా కళకళలాడుతూ కనబడాల్సిన పొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో మండలంలో కరువు తాండవిస్తుంది

అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుని సత్తా

ప్రజాశక్తి-కోటవురట్ల: ఈనెల 8న విశాఖలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పలు విభాగాల్లో మొదటి, తృతీయ స్థానాల్లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు డేవిడ్ మాస్టర్ సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డేవిడ్ మాస్టారు మాట్లాడుతూ, 100 మీటర్స్, 200 మీటర్స్ మొదటి సాధించడంతో పాటు 400 మీటర్లలో మూడవ బహుమతి, లాంగ్ జంప్‌లో మూడవ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కూడా విశాఖలోనే జరుగుతాయన్నారు.


ప్రతిభ కనబరిచిన డేవిడ్

ఆదివాసీలకు పరామర్శ

ప్రజాశక్తి-రోలుగుంట: నర్సీపట్నం సబ్ జైల్‌లో ఉన్న ఆదివాసీలను సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు బుగత బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అనకాపల్లి జిల్లా కార్యదర్శి పియస్.అజయ్ కుమార్, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జనార్దన్, ఆదివాసి సంఘం నాతవరం మండల కార్యదర్శి రేగటి పైడిరాజులు వారిని పరామర్శించి మాట్లాడారు. రోలుగుంట మండలం ఎంకే పట్నం శివారు చటర్జీ పురం గ్రామ ఆదివాసీలు తమ ఆత్మ రక్షణ కోసం చేసిన పోరాటంలో ఆదివాసీలపై తప్పుడు కేసులు పెట్టి నర్సీపట్నం సబ్ జైల్లో నిర్బంధించారని, వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని, ఆదివాసీల సాగు భూములను కబ్జా చేయటానికి ప్రయత్నించి వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సాగు భూముల వివరాలు అడంగల్ నుండి వారి పేర్లను తొలగించిన రోలుగుంట మండల తహశీల్దార్, గ్రామ విఆర్ఓ చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీలపై దాడికి పాల్పడిన అధికార పార్టీ కొయ్యూరు మండల జడ్పిటిసి వారా నూకరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.


మాట్లాడుతున్న నేతలు

జగనన్నకు చెబుదాం ఫిర్యాదుతో

దేవాదాయ భూముల రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: గత నెల మండలంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో 183/1-2-3 నివాస ప్రాంతాలను ఎండోమెంట్ భూమిగా చూపిస్తున్నారని, దీని నుంచి విముక్తి కలిగించాలని ఫిర్యాదులు అందడంతో సోమవారం కోదండ రామస్వామి దేవస్థానం ఈవో ఎస్.రంగారావు తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదు పూర్తిస్థాయిలో పరిశీలించగా సదరు భూమి కోటవురట్ల దేవస్థానానికి సంబంధించి కోదండ రామాలయం భూమిగానే సుమారు 8-20 ఎకరాలు రికార్డుల్లో చూపుతున్నట్లు తెలిపారు. గ్రామంలో కోదండరామస్వామి దేవాలయానికి సంబంధించి 249 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం 67-54 ఎకరాల భూమి పలసాయానికై కౌలుకు రైతులకు అందించారన్నారు. సాత్విక్ ఎలివంట్స్ కింద 30-83 ఎకరాల పోగా, 6-10 ఎకరాలు వరాహ నదిలో, 1-40 ఎకరాలు కాలువలో, 1-76 ఎకరాలు పోరంబోకు గా చూపుతుందని ఇవి మొత్తం కలిసి 54నుంచి 57 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా దేవాలయానికి సంబంధించి వివిధ గ్రామాలలో లింగాపురం 8-00, కోడూరు 7-94, చౌడువాడ 0-10, సుంకపూరు 7-00, పైడిపాల 12-00 ఎకరాల భూమి కోదండరామి స్వామి సంబంధించి ఉన్నట్లు తెలిపారు, కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అప్పారావు, రీ సర్వే డిటి నాని బాబు, విఆర్ఓ అప్పారావు, పాల్గొన్నారు.

పాఠశాలల్లో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: యుటిఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం మండలంలోని పలు జిల్లా పరిషత్ పాఠశాలలను యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అనేక విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. సిపిఎస్ రద్దు చేస్తానని గద్దెనెక్కిన ప్రభుత్వం జిపిఎస్ తీసుకొచ్చిందని ఆరోపించారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఉపాధ్యాయులకు 9వ తేదీ దాటినా జీతాలు చెల్లించకపోవడం దారుణ మన్నారు. ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ వంటి అనేక రకాల బకాయిలను చెల్లించ లేదని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నాడు నేడు ద్వారా సర్వాంగ సుందరంగా ప్రైమరీ స్కూల్స్ తీర్చిదిద్ది 3,4,5 తరగతులను సమీప హైస్కూల్లో విలీనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు స్వర్ణన్ రాజు, బొట్టా రామకృష్ణ, జల్లూరు ప్రసాద్, చిట్టియ్య పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

రహదారి విస్తరణపై సమీక్ష

కొలిక్కి రాని చర్చలు



చర్చలు జరుపుతున్న నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో మెయిన్ రోడ్డు విస్తరణ అంశం సోమవారం మళ్లీ కదిలింది. ఎదురెదురుగా రెండు వాహనాలొస్తే ఇబ్బందులు పడేంత ఇరుగ్గా ఉన్న రహదారిని ముందు 100 అడుగులకు, ఆపై 80 అడుగుల మేర విస్తరించాలని అందరూ నిర్ణయించారు. వ్యాపారులు సైతం సంసిద్ధత వ్యక్తం చేయడంతో సర్వే చేసి మార్కింగ్ కూడా ఇచ్చారు. కొంత మంది వ్యాపారులు, భవన యజమానులు, రాజకీయ నాయకులు అధికార్లపై ఒత్తిడి తేవడంతో మధ్యలోనే పనులు ఆగి పోయాయి. ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో స్థానిక సర్పంచ్ లోప రాజు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయంలో సోమవారం వ్యాపారులు, భవన యజమానులు, ఇరు పార్టీల నాయకులు సమావేశమయ్యారు. రహదారికి ఇరువైపులా 40 అడుగులు కాక 30 చొప్పున చేపట్టాలని కొంత మంది పట్టుబట్టారు. ఆర్అండ్‌బి అధికార్లు 100 అడుగుల మేర మార్కింగ్ చేస్తామంటున్నారని, 80 అడుగులకు అందరూ అంగీకరిస్తే బాగుంటుందని సర్పంచ్ కొన లోవరాజుతో పాటు ఉప సర్పంచ్ పందల దేవ అన్నారు. ఏకాభి ప్రాయానికి రాకపోవడంతో మంగళవారం మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించారు. ఇరుపార్టీలకు చెందిన నాయకులు గుమ్మడు, దొరబాబు, అడ్డూరి నాగభూషణం, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను తదితర్లు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులకు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి- మాడుగుల రూరల్ : కళాకారుల గుర్తింపు కార్డు నమోదు తేదీని పొడిగించాలని అనకాపల్లి జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ ఇన్చార్జ్ ఎలుసూరి ఘాటీలు డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కళాకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, కళాకారులుగా గుర్తించిన డప్పు వాయిద్య, నాట్య కళాకారులు, చర్మకారులు, హరికథ బుర్రకథ, పౌరాణిక కళాకారులకు ఇచ్చే గుర్తింపు కార్డుల నమోదు గడువు తేదీని ఈనెల చివర వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డు ఉంటేనే పెన్షన్ కు అర్హులని చెప్పిన ప్రభుత్వం తక్కువ గడువు తేదీ ఇవ్వడం కళాకారులను ఇబ్బందులకు గురి చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి గొట్టువాడ సామ్రాట్, ఎంఎం దాసు, జె.అప్పారావు, మాణిక్యం, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఘాటీలు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారంపై సోమవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం అంతాడ గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, గర్భిణీలు, బాలింతలకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు.


నివాళ్లర్పిస్తున్న పైలా ప్రసాదరావు

టిడిపి నేతకు నివాళి

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలో తురువోలు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు మురు సోమ నాయుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు సోమనాయుడు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, పాత్రుని సురేష్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నానాజీ

ఎంవిఆర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల తంగేడు గ్రామంలో అకాల మరణం చెందిన శివ కుటుంబ సభ్యులకు ఎంవిఆర్ ఆదేశాలతో సోమవారం రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. నర్సీపట్నం కి చెందిన నానాజీ, గ్రామ రెవెన్యూ అధికారి సతీష్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నమనాయుడు, గోపాలు, సూర్య, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో హేమంత్ కుమార్ సత్తా

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో రేవు పోలవరం గ్రామానికి చెందిన గంపల హేమంత్ కుమార్ అండర్10 విభాగం కరాటే పోటీల్లో సత్తా చాటాడు. సోమ వారం తన తండ్రి గంపల ధనరాజు తెలిపిన వివరాల ప్రకారం. పెందుర్తిలో గంటా కనకరావు మెమో రియల్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా కరాటే పోటీలకు వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. హేమంత్ కుమార్ కరాటే కటా, కుమిటి విభాగాల్లో వేరువేరుగా రెండు గోల్డ్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. గతంలో విశాఖలో జరిగిన కరాటే పోటీల్లో కూడా గోల్డ్ మెడల్ సాధించినట్టు ఆయన తెలిపారు. హేమంత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

